క్లుప్తంగా

కనులపండువగా శ్రీనివాసుడి కల్యాణం



నెల్లూరు(బృందావనం): నగరంలోని ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయ సమీపంలో గల అయ్యప్పస్వామి ఆశ్రమంలో శ్రీదేవీ, భూదేవి సమేత శ్రీనివాస కల్యాణోత్సవాన్ని కనులపండువగా ఆదివారం నిర్వహించారు. ఆశ్రమానికి స్వామివార్ల నూతన పంచలోహ విగ్రహాలను వలేటి ప్రభాకర్ దంపతులు కానుకగా సమర్పించారు. ఈ సందర్భంగా తొలి కల్యాణాన్ని జరిపామని అర్చకులు బ్రహ్మజ్ఞాని రాఘవేంద్ర గోపీ, శ్రీనివాస గురుకుల్ తెలిపారు.

నేత్రదానం



బుజ్జమ్మ (ఫైల్)

నెల్లూరు(అర్బన్): నగరానికి చెందిన మోపూరు బుజ్జమ్మ (85) అనారోగ్యంతో బాధపడుతూ ఓ ఆస్పత్రిలో ఆదివారం మృతి చెందారు. ఈ క్రమంలో ఆమె నేత్రాలను దానం చేసేందుకు కుటుంబసభ్యులు ఇందిర, మోహన్‌కుమార్ అంగీకరించారు. చిరంజీవి ఐ బ్యాంక్ సంస్థ అధ్యక్షుడు సుధీర్ సహకారంతో ఆమె నేత్రాలను ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి టెక్నీషియన్ సునీల్ సేకరించారు. అనంతరం కుటుంబసభ్యులకు నేత్రదాన సర్టిఫికెట్‌ను అందజేశారు. నేత్రదానం చేయాలనుకునే వారు 99595 89321, 98666 16565 నంబర్లను సంప్రదించాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి



నెల్లూరు(బారకాసు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తామని పార్టీ జిల్లా కమిటీలో నియమితులైన నెల్లూరు రూరల్ నియోజకవర్గానికి సంబంధించిన పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చెవిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ లేబూరు పరమేశ్వరరెడ్డి, అధికార ప్రతినిధి రావు శ్రీనివాసరావు, సెక్రటరీ అర్గనైజేషన్ సత్తార్, సెక్రటరీ యాక్టివిటీ బద్దెపూడి వెంకట్రావు, చండి సురేష్‌యాదవ్ పేర్కొన్నారు. ఈ మేరకు చింతారెడ్డిపాళెంలో పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ దంపతులను మర్యాదపూర్వకంగా ఆదివారం కలిశారు. వీరికి శాలువాలు కప్పి ఆనం సత్కరించారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం నేడు

నెల్లూరు(బారకాసు): హెడ్ వాటర్ వర్క్స్‌లో మరమ్మతుల కారణంగా నగరంలోని కోటమిట్ట, పెద్దబజార్, ఆచారివీధి, ముంగమూరు వారివీధి, కామాటివీధి, చాకలివీధి, సుబేదారు పేట, కపాడిపాళెం, చిన్నబజార్, సంతపేట, బృందావనం, పొగతోట తదితర ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో సోమవారం సాయంత్రం అంతరాయం ఏర్పడనుందని కమిషనర్ సూర్యతేజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సరఫరా మంగళవారం నుంచి యథావిధిగా జరగనుందని చెప్పారు.

లూయిూ బ్రెయిలీకి నివాళులు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): లూయిూ బ్రెయిలీ జయంతిని నగరంలోని 54వ డివిజన్ వెంకటేశ్వరపురంలో గల ఈద్గా వద్ద ఏపీ బ్లయిండ్ ఫౌండేషన్, అమ్మా అంధుల అక్షర దీపం ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. దివ్యాంగుల ఐక్య సంఘ జిల్లా అధ్యక్షుడు సనావుల్లా, ఏపీ బ్లయిండ్ ఫౌండేషన్ అధ్యక్షుడు జక్కావుల్లా, జహీర్, కార్పొరేషన్ కో ఆప్షన్ సభ్యుడు జమీర్ అహ్మద్, శీనయ్య, ప్రసాద్, బాబు తదితరులు పాల్గొన్నారు.

నగరానికి కిరణ్‌కుమార్‌రెడ్డి రాక నేడు

నెల్లూరు రూరల్: మాజీ సీఎం, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి నగరానికి సోమవారం రానున్నారని ఆయన వ్యక్తిగత కార్యదర్శి కృష్ణప్ప ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పినాకినీ గెస్ట్‌హౌస్‌లో మధ్యాహ్నం 12.30 నుంచి 1.30 వరకు ప్రజలకు అందుబాటులో ఉంటారని చెప్పారు. పార్టీ కార్యాలయంలో ముఖ్య నేతలు, కార్యకర్తలతో సమీక్షను 2.30కు నిర్వహించనున్నారని వివరించారు.

అజీజ్‌కు సన్మానం

నెల్లూరు (సెంట్రల్): వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా నియమితులైన అబ్దుల్ అజీజ్‌ను నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆదివారం సత్కరించారు. నగరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, బీద రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

కల్లూరుపల్లిలో సమస్యల కూత

- అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ
- అధ్వానంగా రోడ్లు
- సక్రమంగా వెలగని వీధి దీపాలు
- ప్రజల ఇక్కట్లు



దారుణంగా మారిన కల్లూరుపల్లి హౌసింగ్‌బోర్డు కాలనీ ప్రధాన రహదారి

నెల్లూరు (పొగతోట): కార్పొరేషన్ పరిధిలోని కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు కాలనీ సమస్యలకు నిలయంగా మారింది. అధ్వానంగా మారిన రోడ్లు.. అస్తవ్యస్తంగా తయారైన డ్రైనేజీతో స్థానికుల పాట్లు వర్ణనాతీతమవుతున్నాయి. నగరంలోని 24వ డివిజన్ పరిధిలోకి వచ్చే ఈ ప్రాంతంలో దాదాపు నాలుగు వేల కుటుంబాలు నివసిస్తున్నాయి.

అధికారుల నిర్లక్ష్యం

హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీ తర్వాత అతి పెద్ద హౌసింగ్ బోర్డు కాలనీ కల్లూరుపల్లి. అయితే అధికారుల నిర్లక్ష్యం కారణంగా సమస్యలు విలయతాండవం చేస్తున్నాయి. అయ్యప్పగుడి సెంటర్ ఫ్లైఓవర్ నుంచి కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డుకు వెళ్లే రహదారి దారుణంగా మారింది. వర్షాల సమయంలో ఏది గుంతో.. ఏది రోడ్డో అర్థం కాక వాహనచోదకులు అయోమయానికి గురవుతున్నారు. కాలనీలో సీసీ రోడ్డును కొంత మేరే నిర్మించారు.

ఎక్కడి మురుగు అక్కడే..

మురుగు సక్రమంగా పారక ఎక్కడికక్కడే నిల్వ ఉంటోంది. ఫలితంగా దోమల బెడద తీవ్రమవుతోంది. స్థానిక శివాలయం నుంచి ఇందిరమ్మ కాలనీ వరకు వీధిదీపాల్లేవు. సాయంత్రం ఆరు దాటితే రాకపోకలు సాగించాలంటేనే స్థానికులు జంకాల్సిన పరిస్థితి నెలకొంది. దొంగల బెడదా అధికంగా ఉంది. కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు కాలనీలో పోలీస్ అవుట్‌పోస్ట్‌ను ఏర్పాటు చేస్తే సమస్య పరిష్కారమయ్యే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



ఇళ్ల మధ్య ప్రవహిస్తున్న మురుగు



రోడ్డు పక్కన ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

ఉపాధ్యాయుడికి సత్కారం



నెల్లూరు (టౌన్): ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ గత నెల 31న ఉద్యోగ విరమణ పొందిన హస్తి లక్ష్మణరాజు దంపతులను వేదాయపాళెంలోని వెంకటరమణ కల్యాణ మండపంలో ఆదివారం సత్కరించారు. విద్యారంగానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



నెల్లూరు(బృందావనం): కామాటివీధిలోని కృష్ణ మందిరంలో నూతన సంవత్సర క్యాలెండర్లను అగ్నికుల క్షత్రియ సంఘ ఆధ్వర్యంలో ఆదివారం ఆవిష్కరించారు. సంఘ అధ్యక్షుడు చమ్మండి రాము, కార్యదర్శి తిరువత్తూరు శివశంకర్, డాక్టర్ జయసింహ, వెంకట్రావ్, ఉమామహేశ్వరరావు, విఠల్, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..







నెల్లూరు(బారకాసు): మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆత్మకూరు, సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యేలు మేకపాటి విక్రమ్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డితో పాటు ఆయా నియోజకవర్గాలకు సంబంధించి పార్టీ జిల్లా కమిటీలో పదవులు పొందిన వారు మర్యాదపూర్వకంగా ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియజేశారు. అనంతరం జిల్లా రాజకీయాలపై చర్చించారు.

అబ్దుల్ మస్తాన్‌కు పరామర్శ



నెల్లూరు(బారకాసు): నగరంలోని 42వ డివిజన్‌కు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత అబ్దుల్ మస్తాన్ గుండె సంబంధిత సమస్యకు గురై చికిత్స పొంది కోలుకున్నారు. ఈ క్రమంలో ఆయన నివాసానికి ఎమ్మెల్సీ, పార్టీ నగర నియోజకవర్గ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం వెళ్లి పరామర్శించారు. పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హంజాహుస్సేనీ, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు సిద్ధిక్, యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు ఊటుకూరు నాగార్జున, జిల్లా కార్యదర్శి జహీద్ తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ, అరబ్బీలో శిక్షణ



మాట్లాడుతున్న జాఫర్ షరీఫ్

నెల్లూరు(బృందావనం): ఉర్దూ, అరబ్బీ భాషల్లో శిక్షణను అందించి.. భాషపై వారికి మక్కువ కల్పించేందుకు పర్వీన్ చేస్తున్న కృషిని మైనార్టీ నేత జాఫర్ షరీఫ్ అభినందించారు. జెండావీధిలోని ఖ్వాజా గరీబున్ నవాజ్ ఉర్దూ, అరబ్బీ శిక్షణ కేంద్రంలో కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణ కేంద్ర నిర్వాహకురాలు పర్వీన్ మాట్లాడారు. తొలి విడతగా 70 మంది అభ్యసిస్తున్నారని చెప్పారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

ఖురాన్ కంఠస్థ పోటీలు



బహుమతిని అందజేస్తున్న కరిముల్లా

నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని ఎండీ కన్వెన్షన్‌లో ఖురాన్ పఠనం, కంఠస్థ పోటీలను జమాఅతె ఇస్లామీ హింద్, యునైటెడ్ ఫోరం ఫర్ ఖురానిక్ స్టడీస్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ నగరాధ్యక్షుడు మొఘల్ అన్వర్ బేగ్ మాట్లాడారు. నగర, జిల్లా స్థాయితో పాటు ప్రకాశం, గుంటూరు, కృష్ణా జిల్లాల పరిధిలోని విద్యార్థులకు పోటీలను నిర్వహించామని వివరించారు. విజయవాడలో ఫిబ్రవరి తొమ్మిదిన నిర్వహించనున్న ఫైనల్స్‌కు 11 మందిని ఎంపిక చేశామని చెప్పారు. ప్రతిభ చూపిన వారికి నగదు బహుమతి, సర్టిఫికెట్లు, మెడల్స్‌ను అందజేశారు. జమా అతె ఇస్లామి హింద్ రాష్ట్ర సభ్యుడు నవీద్ అహ్మద్, మైనార్టీ నేత జకీర్, కార్పొరేటర్ కరిముల్లా, జమాలుల్లా, ఖాదర్ నవాజ్, ఇలియాజ్, మొయినుద్దీన్, ఆయాజ్, సందానీ, అబ్దుల్ ఖయ్యూం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గాన నీరాజనం



నెల్లూరు(బృందావనం): అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు, మహమ్మద్ రఫీ జయంతి వేడుకలను నగరంలోని పురమందిరంలో శాంతి కల్చరల్స్ అధ్యక్షుడు అమానుల్లాఖాన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. గాయకులు ఆలపించిన మధుర గీతాలతో వారికి గాన నీరాజనాన్నిపలికారు. ముఖ్యఅతిథిగా 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి హాజరయ్యారు. సంగీత విభావరి అలరించింది. పాటలు, డ్యాన్స్ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. పేరూరి ప్రదీప్, కేతా సుబ్బారావు, శ్రీనివాసులు, మురళీకృష్ణ, వాకాటి విజయకుమార్‌రెడ్డి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

విశేషాలంకారాల్లో దర్శనం



రంగనాథుడు



వేణుగోపాలుడు

నెల్లూరు(బృందావనం): పగల్‌పత్తు ఉత్సవాలను పురస్కరించుకొని నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో స్వామివారు విశేష పుష్పాలంకారంలో ఆదివారం దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా డాక్టర్ ప్రసన్నగుప్తా, దుర్గావరం వ్యవహరించారు. ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

- మూలాపేటలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో స్వామివారు వేణుగోపాలుడిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా తన్నీరు నరసింహస్వామి వ్యవహరించారు. దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తల మండలి చైర్మన్ మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, ఈఓ శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 33 / 11 కేవీ శెట్టిగుంటరోడ్డు సబ్‌స్టేషన్ పరిధిలో రోడ్డు వెడల్పు చేసిన ప్రాంతాల్లో స్తంభాలను మార్చనున్న తరుణంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా సోమవారం ఉండదని నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజీవ్‌గాంధీ కాలనీ, మధురానగర్, ప్రశాంతినగర్, పల్లిపాడు రోడ్డు, కిసాన్‌నగర్, జాకీర్‌హుస్సేన్‌నగర్, మైపాడు రోడ్డు, వేణుగోపాల్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు.

వాకర్స్‌కు వైద్య పరీక్షలు



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో వాకర్స్‌కు వైద్య పరీక్షలను ఏసీ సుబ్బారెడ్డి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. దాదాపు 400 మందికి బీపీ, షుగర్ పరీక్షలను అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు వింజం రామానాయుడు సౌజన్యంతో జరిపారు. డాక్టర్లు శ్రీనివాస కుమార్, సత్యనాథ్, శ్రీధర్‌రెడ్డి, అసోసియేషన్ అధ్యక్షుడు పాబోలు సత్యం, కార్యదర్శి స్నేహ సురేష్, ట్రెజరర్ గాలి రఘురామనాయుడు, మాజీ అధ్యక్షుడు వేలూరు రంగారావు, శేషగిరిరావు, కనకట్ల రఘురామ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదమా.. అదెక్కడా..?

- రూపుకోల్పోతున్న సత్యనారాయణపురం పార్కు
- నిర్వహణ లోపంతో ఈ దుస్థితి
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్న వైనం



నాడెంతో ఆహ్లాదకరంగా సత్యనారాయణపురం పార్కు

నెల్లూరు(బారకాసు): నలుగురికి ఆహ్లాదాన్ని పంచాల్సిన పార్కు నిర్వహణ లోపంతో రోత పుట్టిస్తోంది. చీకటి పడితే అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోంది. ఆహ్లాదం సంగతేమో గానీ ఈ పార్కుతో కొత్త తలనొప్పులొస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగరంలోని ఐదో డివిజన్లో గల సత్యనారాయణపురంలో ఎస్వీఆర్ స్కూల్ పక్కనే ఉన్న పార్కు ఇలా దుర్భరంగా మారుతోంది.

నాడు కళకళ..

నుడా పరిధిలో ఉన్న ఈ పార్కును ఎనిమిదేళ్ల క్రితం కార్పొరేషన్‌కు అప్పగించారు. అప్పటి టీడీపీ ప్రభుత్వం ఈ పార్కును కొంత మేరకు బాగు చేసి వదిలేసింది. ఆపై నిర్వహణను విస్మరించింది. ఈ తరుణంలో గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో రూ.20 లక్షలను వెచ్చించి పార్కులో పచ్చిక వేసి, మొక్కలు నాటడంతో పాటు వాకింగ్ ట్రాక్, కూర్చునేందుకు సిమెంట్ బెంచీలు, విద్యుద్దీపాలను ఏర్పాటు చేసి ఎంతో సుందరంగా తీర్చిదిద్దారు. దీంతో రోజూ కళకళలాడేది.



పచ్చదనం కరువై దుర్భర స్థితికి

నేడు వెలవెల..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పార్కు నిర్వహణను కార్పొరేషన్ అధికారులు గాలికొదిలేశారు. కనీసం పార్కును శుభ్రం చేసే వారే కరువయ్యారంటే సమస్య తీవ్రత ఏమిటో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం ఇక్కడ చెత్త, మందు బాటిళ్లు, గ్లాసులు, చిప్స్ ప్యాకెట్ కవర్లు పేరుకుపోయి దుర్భరంగా మారింది. సిమెంట్ బెంచీలు విరిగిపోవడం .. మొక్కలు, పచిగడ్డి ఎండిపోయి.. పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగడంతో ఇక్కడికి రావడాన్ని స్థానికులు మానేశారు.

ఆకతాయిల ఆగడాలు

వాచ్‌మెన్‌ను నియమించకపోవడం.. పార్కుకు స్థానికులు పెద్దగా రాకపోతుండటంతో కొందరు ఆకతాయిలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చేశారు. చీకటి పడితే మద్యం, గంజాయిని సేవిస్తూ గొడవలు పడుతూ చుట్టుపక్కల వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారు. దీనిపై నవాబుపేట పోలీసులకు స్థానికులు పలుమార్లు ఫిర్యాదు చేశారు. అయితే వారొచ్చి హడావుడి చేస్తున్నారే తప్ప, ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట వేయడంలేదని ఆరోపిస్తున్నారు. ఈ సమస్యలను పరిష్కరించి పార్కుకు పూర్వ వైభవం తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.



విరిగిపోయిన సిమెంట్ బెంచీలు

వ్యాయామ పరికరాలను బాగుచేయాలి



పార్కులో వ్యాయామ పరికరాలు మరమ్మతులకు గురయ్యాయి. పార్కు ఆలనాపాలన కరువైంది. ఇక్కడికి రావాలనే ఆసక్తి గతంలో ఉండేది. అయితే పార్కును ప్రస్తుతం చూస్తే భయమేస్తోంది. వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేసి నిర్వహణపై దృష్టి సారించాలి.

– ఏటూరి అశోక్, సత్యనారాయణపురం

నిర్వహణను గాలికొదిలేశారు



సత్యనారాయణపురంలోని పార్కు గతంలో ఎంతో సుందరంగా ఉండేది. వాకింగ్ నిమిత్తం రోజూ ఎంతో మంది వచ్చేవారు. అయితే ప్రస్తుతం అధ్వానంగా మారింది. ఆకతాయిల ఆగడాలతో ఇక్కడికి రావాలంటేనే జంకే పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి పార్కును సుందరంగా తీర్చిదిద్దాలి.

– వీరాస్వామి, జాకీర్‌హుస్సేన్‌నగర్